సీరియల్ కథ

# మహాప్రవాహం

'కినిమా'

మొదటి అధ్యాయం


**1947** ఆగస్టు 15 ఉదయం. కరాచీ విమానకేంద్రం చాలా హడావుడిగా ఉంది. మామూలు విమానసర్వీసులు కాక అనేక ప్రయివేటు విమానాలూ, విదేశీవిమానాలూ కరాచీకి ఎక్కడెక్కడినుండో వ్యక్తులను చేరవేస్తూ, కరాచీనుండి వ్యక్తులను తీసుకుపోతున్నవి. ఇందులో చాలాభాగం న్యూ ఢిల్లీ పోయేవి. వీటిలో విదేశీ ప్రభుత్వాల ప్రతినిధులూ, వ్యాపారస్తులూ, బదిలీ అయి వెళ్ళే భారత ప్రభుత్వ ప్రతినిధులూ, రాత్రి పన్నెండుకు న్యూ ఢిల్లీలో జరిగే ఉత్సవానికి హాజరుకావలిసినవాళ్ళూ ఉన్నారు.

ఉదయం పదిగంటలప్రాంతాల కరాచీ విమానకేంద్రం నుంచి ఒక ప్రైవేటు విమానం బయలుదేరింది. అది ఒక మహారాజాగారిది. కొంతకాలంగా భారతప్రభుత్వంవారు దాన్ని సర్వేకు వినియోగిస్తున్నారు. ఈ విమానంలో న్యూ ఢిల్లీకి పోతున్న ప్రయాణీకులు నలుగురున్నారు.

వీరిలో ముఖ్యుడని చెప్పదగినవాడు విక్రమ్‌సింగ్ అనే వాడు. ఇతని వయసు ముప్పై. అలహాబాదు విశ్వవిద్యాలయంలో చదివాడు. ఆటలపోటీలలోనూ, చదువులోనూ కూడా అద్భుతంగా రాణించినవాడు. ఇదిగాక అతనికి చాలా రకాల సంగీతాలలో అభిరుచి ఉండేది. కాని డిగ్రీ పుచ్చుకున్నతరవాత ఇతని జీవితం ఎవరూ అనుకోని తోవల నడిచింది. అతను ఏదో వంకపెట్టుకుని చాలా దేశాలు తిరిగాడు. ప్రభుత్వోద్యోగి అయినతరవాతకూడా అతనికి నిలకడ లేకపోయింది. ఉద్యోగాలు ఏరుకోవటంలో విక్రం ప్రమోషన్లకన్నా, ధనార్జనకన్నా అనుభవానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. న్యూ ఢిల్లీనే అంటిపెట్టుకుని ఉంటే అధమం ఏ సెక్రటరీ అయినా కాదగినవాడు. అతనితోబాటు ప్రభుత్వోద్యోగులైనవారు ఇతర దేశాలకు అనేక ముఖ్య ప్రతినిధులుగా వెళ్ళి చారిత్రక సమావేశాలలో పాల్గొంటున్న యుద్ధకాలంలో అతను ఏ టిబెట్టుప్రభుత్వంతోనో వ్యాపారసంప్రదింపులకు వెళ్లాడు. అందుచేతనే అతని పేరు చాలా అరుదుగా పత్రికలలో పడుతూండేది. అయితే ఇసంతా విక్రంకు అసంతృప్తి కలిగించిందని చెప్పటానికి లేదు. అతను సమర్థుడే అయినా ఆశాజీవికాడు.

పాకిస్తాను విభజన సందర్భంలో విక్రం కనపడని పని చాలా చేశాడు. ఈ మహారాజాగారి విమానంలో పడుకుని ప్రయాణిస్తుంటే అతనికి తలపుమీద వెడుతున్నట్టుగా ఉంది. తనను ఏ పాసెంజరు విమానంలోనో తోయకుండా సుఖంగా ఈ విమానంలోకి ఎక్కించిన అధికారులకు విక్రం తన మనస్సులో ధన్యవాదాలు చెప్పుకున్నాడు. అవసరమైతే సిమ్లానుండి కులూలోయకు కాలినడకన ప్రయాణం చేయగలవాడే అయినా విశ్రాంతితీసుకునేప్పుడు రాజభోగంగా జరుపుకోవాలన్నది అతని సిద్ధాంతం.

మిగిలిన ప్రయాణీకులలో ఒకడు కాప్టెన్ అభయంకర్ కరాచీలోని భారతీయ కాన్సలేట్‌లో వుంటూవచ్చినవాడు. విక్రంను బాగా ఎరిగినవాడు, అధికారరీత్యా సంబంధంవున్నవాడు. యువకుడు. ఇతని న్యూఢిల్లీ ప్రయాణం తాత్కాలికమనీ, అతను మళ్ళీ కరాచీకి పంపబడతాడనే భావించబడింది. మూడోవాడు నిజాంరాష్ట్రానికి చెందిన ముస్లిము. పేరు షేక్ మహమ్మదాలీ. నడివయస్సువాడు. నాలుగో మనిషి స్త్రీ, ఆమెకూడా నడివయస్సుదే. పేరు శోభారాణి. గుజరాత్‌లోని సంస్థానాలలో ఒక రాజకుటుంబానికి చెందినది, ఇంగ్లండులో చదువుకున్నది. రెడ్‌క్రాస్‌తో ఆమెకేదో సంబంధంవున్నది. దర్జాలూ, పోజులూ ఏమీలేని మనిషి.



"జ్యోతి"లో జ్యోతిగా వరలక్ష్మి, ఆమె తండ్రిగా పెరుమాళ్లు

విమానం కరాచీవదిలి గంట దాటింది. అందరికన్న ముందు కూచున్న కాప్టెన్ అభయంకర్ మిగిలినవాళ్ళకేసి తిరిగి, "ఈ విమానం సూటిగాపోవటంలేదు," అని ఫిర్యాదుచేశాడు.

సీటులో కళ్ళుమూసుకుని పడుకున్న విక్రం బద్ధకంగా కళ్ళుతెరిచి, "పైలట్ ఇష్టంవచ్చినట్టు పోనీ, మనకేం ?" అన్నాడు—మళ్ళీ కళ్ళు మూసుకుంటూ. విమానం రొదకు అతనికి నిద్రరాసాగింది.

మరో అరగంటకు కాప్టెన్ అభయంకర్ మళ్ళీ విక్రంను నిద్రలేపి, "మనపైలట్ మల్కానీ అనుకున్నానే?" అన్నాడు.

"కాదా ?" అని అడిగాడు విక్రం.

"ఇంతకుముందే ఈ పైలట్ తల పక్కకితిప్పితే చూశాను. మల్కానీ కానేకాదు."

"అద్దంలోనుంచి తెలుసుకోవటం కష్టంలే."

"మల్కానీ మొహాన్ని చీకట్లోకూడా గుర్తించగలను."

"అయితే మరోడయివుంటాడు, ఎవరైతే మనకేం ?"

"విమానదళం వాళ్ళందర్నీ నేనెరుగుదును. వీడెవడో కొత్తవాడు."

"అయితే పాలం చేరగానే పరిచయం చేసుకుందు గానివిలే."

"ఈ విమానం ఢిల్లీవెళ్ళేట్టేవుంది ! పైగా యింత యెత్తున పోతాడే, ఎటుపోతున్నదీ యెట్లాతెలుస్తుంది ?"

విక్రం జవాబు చెప్పలేదు. ఈ విమానం న్యూఢిల్లీకి నాలుగు గంటలలో వెళ్ళినా, అరుగంటలలో వెళ్ళినా అతని కొకటే, సూటిగా వెళ్ళినా సుడిగుండాలు తిరిగి వెళ్ళినా అతనికి అభ్యంతరంలేదు. పాలం విమాన కేంద్రంలో తనను ఆలింగనంచేసుకుని ఆతిథ్యం ఇచ్చేవారెవరూ లేరు. అతను ఎన్నోదేశాలలో ఏన్నోచోట్ల ఉండినవాడు కావటం చేత అతనికి స్వక్షేత్రమనేది లేకుండాపోయింది.

ఒక్కసారి కడుపు ఖాళీఅయిన భావనకలిగి విమానం ఎత్తు దిగుతున్నట్టు సూచించింది. అభయంకర్ సందేహాలన్నీతీరే సమయం ఆసన్నమయినందుకు విక్రం సంతోషించాడు. కాని ఈ సంతోషం దక్కలేదు.

విమానం కిటికీలోనుంచి బయటికిచూస్తున్న అభయంకర్ "ఇదేమిటి ? కిందచూడు ?" అన్నాడు.

విక్రం చూశాడు. అతనికి ఆశ్చర్యం కలిగింది. కింద ఉండవలసిన విమాన కేంద్రమూ, రన్వేలూ, హంగార్లూ ఏమీలేవు. నిర్మానుష్యమూ, నిర్జీవమూ అయిన ప్రదేశంలో విమానం దిగుతోంది. ఎక్కడ చూసినా గోధుమరంగు మట్టితప్ప ఇంకేమీ కనిపించటంలేదు. దూరాన పర్వత పంక్తీ, వాటి వెనుకగా మైదానాలూ ఆ ఎత్తునుండి గోచరించాయి. ఆ ప్రదేశం వాలకంచూస్తే సరిహద్దు రాష్ట్రం స్ఫురణకు వస్తున్నది.

విక్రం అభయంకర్ చెవిలో ఇతరులకు వినపడకుండా "నీ అనుమానం సరిగానే ఉంది. ఈ వెధవ దారి తప్పాడు" అన్నాడు.

విమానం అతి వేగంగా దిగుతోంది. కిందినుంచి వేడి సెగ విమానాన్ని అందుకోసాగింది. కొండలు సమీపానికి వచ్చి పైకి లేస్తున్నాయి. వాటిమధ్య ఒక లోయలోకి విమానం ప్రవేశించింది. లోయ యావత్తూ రాళ్ళమయం.

"ఇక్కడే దిగేటట్టున్నది" అన్నాడు షేక్ మహమ్మదాలీ.

"అసంభవం" అన్నాడు విక్రం. "మతి ఉంటే అటువంటి ప్రయత్నం చెయ్యడు. విమానం పప్పుపప్పయి పోతుంది. ఆ తరవాత—"

విక్రం మాటపూర్తికాక పూర్వమే విమానం నేలకు దిగింది. ఎగుడు దిగుడు నేలమీద ఊగిసలాడుతూ నడిచి విమానం ఆగిపోయింది. విమానం ఆగిన మరుక్షణం,

పెద్ద తలగుడ్డలు ధరించిన పఠాన్ కొండజాతులవాళ్లు విమానాన్ని చుట్టుముట్టి పైలట్ తప్ప మరెవ్వరూ విమానం నుండి దిగకుండా అడ్డుకున్నారు. పైలట్ మల్కానీ కాడనీ, అసలు భారతీయుడేకాడనీ తేలిపోయింది. పెట్రోలు టిన్నులుతెచ్చి కొందరు విమానం నింపసాగారు. లోపలి ప్రయాణీకులుచేసిన ఆందోళనను ఎవరూ వినిపించుకోలేదు. వాళ్ళు దిగటానికి యత్నించినప్పుడల్లా ఇరవై తుపాకులు వారికేసి బారుచేయబడ్డాయి. పుష్తుభాష కొద్దిగా తెలిసిన విక్రం తలగుడ్డవాళ్ళను సంబోధించటానికి యత్నించాడు. కాని లాభంలేకపోయింది. పైలట్‌ను చాలా భాషలలో విక్రం పలకరించి చూశాడు కాని, దీనికి జవాబుగా పైలట్ తన రివాల్వరుతో బెదిరించాడు.

నడి ఎండ మండిపోతోంది. విమానం లోపలి ప్రయాణీకులు మగ్గిపోతున్నారు. ఈ సరిహద్దు పఠానులు ప్రయాణీకులకు సాయపడకపోయినా శత్రుత్వంమటుకు ఏమీ ప్రకటించలేదు. విమానంలో పెట్రోలు భరాయించటం పూర్తి అయింది. అక్కడివాళ్ళతో మాట్లాడటం పూర్తి చేసి పైలట్ తన "కాక్‌పిట్" లో ఎక్కాడు. ఒక పఠానువాడు ప్రొపెల్లర్ తిప్పాడు. విమానం బయలుదేరింది. పైలట్ విమానాన్ని దింపటంలో చూపిన చాకచక్యంకంటె మళ్ళీ లేపటంలో ఇంకా ఎక్కువ చాకచక్యం చూపాడు. విమానం కొంత ఎత్తుకు లేచిన పిమ్మట తూర్పుముఖమై సూటిగా పోసాగింది. అప్పటికి మధ్యాహ్నం మూడుగంటలయింది.

ఇప్పుడీ ప్రయాణీకులకు తమ అనుభవం ఏమాత్రమూ అర్థంకావటంలేదు. సరిహద్దు అనేక వింతసంఘటనలకు ప్రసిద్ధికెక్కింది. కాని యిటువంటి అర్థంలేని సంఘటన గురించి ఎక్కడా, ఎప్పుడూ, ఎవరూ వినలేదు. ప్రయాణీకులకు మొదట కలిగినభావం విస్మయం, తరవాత కోపం. అదికూడా వుడిగినాక వారు జిజ్ఞాసలోపడ్డారు. జరుగుతున్నదేమిటి ?

"ఇది సరిహద్దువాళ్ళపనే ? పాకిస్తాన్‌వాళ్ళు వీళ్ళకేదో లంచంయిచ్చి ఈ పని చేయిస్తుంటారు. మనం బతికి బయటపడే ఆశలేదు," అన్నాడు అభయంకర్ చురచురా షేక్‌మహమ్మదాలీకేసి చూస్తూ.

"అల్లాహో అక్బర్! అటువంటిదేమీ వుండదు. ఉంటే మీప్రాణాలకి నాప్రాణం అడ్డేస్తా." అన్నాడు షేక్ సాయిబు.

సంభాషణ ఈవిధంగా నడుస్తుండగా విక్రం కర్తవ్యం చూడసాగాడు. అతను తన చేతిసంచిలో దొరికిన తెల్ల కాగితాలన్నీ పోగుచేసి వాటిమీద తమ దుర్గతి వివరంగా రాసి ఒక్కొక్క కాగితమే విమానంలోనుండి బయటికి వదలసాగాడు. ఎవరుచూశారు ? ఏఒక్క కాగితంముక్క ఎవరికి దొరికినా పని జరగవచ్చు. పూర్వం రావణుడు ఎత్తుకుపోయేటప్పుడు సీత తన నగలను ఇట్లాగే జారవిడిచింది. పని జరగలేదా ? విక్రం ప్రతి కాగితంముక్కమీదా తనకు తెలిసినభాషలన్నీ వుపయోగించసాగాడు.

అందరూ ఈవిధంగా నిమగ్నులై వున్నప్పటికీ స్త్రీ ప్రయాణీకురాలు, శోభారాణి నోరువిప్పలేదు. ఆమె ముఖాన భయంగాని, ఆందోళనగానిలేదు. సంతోషం అంతకన్నా లేదు. ఇష్టంలేని విందుకు తప్పనిసరి అయివచ్చినదానిలాగా ఆమె మౌనంగా తన సీటులో నిటారుగా కూచుంది.

విక్రం తన పని పూర్తిచేసి నడుంవాల్చాడు. బడలిక చేత అతనికళ్ళు మూసుకుపోయాయి. కాని అతనికి నిద్ర పట్టలేదు.

అభయంకరూ, షేక్‌సాయిబూ సంభాషణ సాగించారు. సాయిబుగారు విక్రంను సూచించి, "మీ మిత్రుడా ?" అని అడిగాడు.

తమిళచిత్రం "జ్యోతి"లో ప్రభాకరరావు, రామస్వామి



"ఆరునెల్లుగా మేం కలిసి పనిచేస్తున్నాం. అతనికి నాలుగురోజులుగా కన్ను మూతఅన్నదిలేదు. ఈ దుస్థితిలో ఇటువంటి వాడుండటం గుడ్డిలోమెల్ల. చాలా సమర్థుడు. అపాయంలో తొణకడు,'' అన్నాడు అభయంకర్.

"అయితే నిద్రపోనివ్వండి, పాపం,'' అన్నాడు సాయిబుగారు.

ఇంతసేపూ విమానం చాలా ఎత్తుగాపోతోంది. నేలకు పొగమంచు అడ్డున్నట్టుగా ఉండటంవల్ల విమానం ఏ ప్రాంతంలో పోతున్నదీ తెలియరావటంలేదు. విమానం మటుకు స్థూలంగా తూర్పుదిశగానేపోతూ అప్పుడప్పుడూ మధ్యమధ్యఉత్తరానికి కోస్తున్నది, ఎప్పుడన్నా పొగమంచు పల్చబడినప్పుడు క్షణంపాటు నేలమీద ఏ పర్వతాగ్రమో, పాముకూసంలాగా పరుచుకుని మెరిసే నదో కనిపించేది. మరుక్షణమే పొగమంచు అడ్డొచ్చేది.

"ఏమిటిది? ఈ పిచ్చముండాకొడుకును మనమేమీ చేయలేమా? ఇలా చేతులు ముడుచుకు కూర్చోవలిసిందే?" అని రుసరుసలాడాడు అభయంకర్. "ఈ అద్దం పగల గొట్టి వాడి పొగరణిస్తేనేం?''

"ఆతరవాత విమానాన్ని కిందికి ఎవరు దింపుతారు?" అన్నాడు విక్రం.

"పోనీ వాణ్ణే విమానం దింపేటట్టు చెయ్యలేం?''

"ఏంచేద్దామో నువే చెప్పు!''

"ఏమైనా చెయ్యొచ్చు. మనం ముగ్గురం మొగవాళ్ళం ఉన్నాం. వాడు ఒక్కడు. మనని ఎక్కడికి తీసుకు పోతున్నాడో అదైనా చెప్పించలేకపోతే ఇక మన మగ తనం దేనికి, కాల్చనా?''

"సరే, యత్నించిచూదాం,'' అంటూ విక్రం, తమకూ పైలెట్‌కూ మధ్యవున్న చిన్న గవాక్షంమీద తట్టాడు. ఇదొక చిన్న కంత. పైలట్ ప్రయాణీకులకేదన్నా చెప్ప డానికి ఈ కంతకుండే తలుపు పక్కకు తోయవచ్చు.

విక్రం దీనిమీద తట్టగానే ఈ గవాక్షం తెరుచుకుంది. కాని ఆ కంతలోనించి రివాల్వరుమాత్రమే దర్శనమిచ్చింది. వేరే మాటా, పలుకూలేదు. విక్రం ఇవతలికి వచ్చేశాడు. గవాక్షం మళ్ళీ మూసుకుంది.

"వొట్టి బుకాయింపు. ఆ రివాల్వరుతో మనని వాడు కాల్చలేడు" అన్నాడు అభయంకర్ ధుమధుమలాడుతూ.

"కావచ్చు. కాని అది బుకాయింపని నువు రుజువు చేస్తావా?"

"మనం ఏమీ చెయ్యలేకపోవటం నాకేమీ బాగాలేదు"


"నిస్సహాయతను గుర్తించటంలో అవమానమేమీ లేదని నా ఉద్దేశం'' అన్నాడు విక్రం.

సాయిబుగారుకూడా ఈ అభిప్రాయాన్ని బలపరిచాడు.

"గోడకేసి ఎవరన్నా తల కొట్టుకుంటారా జనాబ్? చెయ్యిమించినప్పుడు సంతోషంగా సంక్షేపించుకోవటం యోగ్యత"

విక్రం మళ్ళీ కళ్ళుమూసుకుని ఈసారి నిజంగా నిద్ర పోయినాడు. అతనికి మళ్ళీ తెలివి వచ్చేసరికి మిగిలినవాళ్లు కూడా నిద్రపోతున్నారు. అతను కిటికీలోనుంచి బయటికి చూశాడు. ఇప్పుడు వాతావరణం చాలా నిర్మలంగా ఉంది, ఆ దృశ్యంచూసి అతనికి ఉక్కిరిబిక్కిరి అయినట్టని పించింది. కనుచూపు మేరవరకూ మంచు తోరణాలలాగా హిమశృంగాల శ్రేణులు ఒకదాని తరవాత ఒకటికిగా పరచు కుని ఉన్నాయి. పడమటి దిక్కున ఆకాశం రంగులీను తున్నది. విమానానికి కిందుగా పెద్ద అగాధం. దానికి తూర్పు చివరను ఒక తెల్లని గోడ లేచినట్టుగా ఉంది. ఆకాశం రంగులు కలిసిపోయి ఉండటంచేత మొదట ఈ

"జ్యోతి" (తమిళం"లో) శ్రీరామమూర్తి, సుబ్బయ్య (ఎస్. ఎస్. కృష్ణన్ తమ్ముడు)



గోడ తెలియరాలేదు. కానీ విక్రం చూస్తుండగానే ఈగోడ సూర్యకాంతిని ప్రతిబింబించి ధగధగా మెరవసాగింది. ఈ వింతప్రకృతి మీదుగా ఎగురుతూ ఆ దూరపు మంచు శిఖరాలకేసి పోతూఉండటం అపూర్వమైన అత్యాచారం అనిపించింది. అభయంకర్ నిద్ర మేలుకున్నట్టు తెలుసుకుని విక్రం అతన్ని తట్టాడు.

క్రమంగా మిగిలిన ఇద్దరూ లేచారు. సంభాషణ సాగింది.

“ఇది ఏ ప్రాంతం అయిఉంటుంది?” అని అడిగాడు షేక్‌సాయిబు.

“చెప్పలేను, మనం ఇంకా ఇండియా సరిహద్దులలోనే ఉన్నామని నా నమ్మకం. బహుశా మన విమానం సింధు నది వెంబడే ఎగువకు పోతున్నదని ఊహిస్తాను. ప్రపంచంలో సింధునదీ జన్మస్థానమంత విచిత్ర దృశ్యం మరి లేదంటారు. మనం అటువంటి దృశ్యాన్నే చూస్తున్నాం” అన్నాడు విక్రం.

“అయితే మనం ఎక్కడున్నదీ మీకు తెలుసునన్న మాట!”

“తెలుసునని చెప్పలేను, కాని ఆ కనిపించే శృంగం నంగపర్వతం కావొచ్చు. నేను విన్న వర్ణనలకు ఇది సరిపోతోంది.”

అభయంకర్ అడ్డొచ్చి. “మనం ఎక్కడుంటే ఎవడిక్కావాలి? ఏట్లోవాడికి? మనం ఎక్కడికి పోతున్నామో చెప్పేనాధుడుంటే బాగుణ్ణు” అన్నాడు చిరాకుగా.

“ఆ దూరాన కనిపించే పర్వతశ్రేణికేసి పోతున్నామని నా ఉద్దేశం” అన్నాడు సాయిబుగారు. “ఏమంటారు, విక్రం?”

“సందేహంలేదు. అది కారకోరం పర్వతశ్రేణిఅయి ఉండాలి. వాటి వెనుక టిబెట్టున్నది. మనవాడు ఈ పర్వతాలను దాటదలిస్తే చాలా కనుమలున్నాయి”

అభయంకర్ పైలట్‌ను శపించసాగాడు, ఇది పాకీస్తానువాళ్ళపని కాదనీ, పఠానువాళ్ళపని అసలేకాదనీ, ఈ విమానం నడిపేవాడు ఉన్మాది అయిఉండాలనీ అన్నాడు.

“ఉన్మాది అవునోకాదో తెలీదుగాని ఎంతో అద్భుతమైన నేర్పరికాకపోతే, వాడు ప్రపంచంలోకల్లా ఎత్తయిన ఈ పర్వతాలమీదిగా విమానం నడపలేడని చెప్పగలను.” అన్నాడు షేక్‌సాయిబు.

“వాడినేర్పరితనం అడుక్కు-తిన్నట్టుంది! మనం ఎక్కడికి పోతున్నాం? అసలెక్కడికైనా పోతున్నామా? లేక ఇది ఏకంగా వైకుంఠయాత్రా? ఎక్కడికైనా పోయినా అక్కడ మనగతేం కానుంది?” అని అభయంకర్ గుక్కతిప్పుకోకుండా అడిగాడు.

విక్రం మాట్లాడలేదు. అభయంకర్ ఆక్రోశమేలేకపోతే ఇదంతా ఆనందించదగిన అనుభవంగానే కనబడింది. మిగిలినవాళ్లు ఆటే ఆరాటం ప్రకటించలేదు. బయటచూసి ఆనందించదగినది చాలావుంది. మనిషికి లొంగని ఇటువంటి అద్భుతప్రకృతి ఇంకా ప్రపంచంలో వుండటం విక్రంకు ఆశ్చర్యం కలిగించింది.

ఉత్తరపుదిశన ఆకాశం నల్లబారసాగింది. అందుచేత కారకోరం మంచు మరింత తెల్లగా కనబడసాగింది. ఈ శృంగాలను జయించాలనే ఆశ ఎవరికీ కలగదు.

క్రమంగా చీకటిపడింది. పౌర్ణమి చంద్రుడు ఉదయించాడు. హిమశృంగాలమీద వెన్నెల వెండిపూతలు పూయసాగింది. కొద్దిసేపటిలోనే బారుగా ఆకాశంచుట్టూ వెండిదీపాలు వెలిగించినట్టయింది. చలివేయసాగింది. తీవ్రమైన గాలి ఊపుకు విమానం, తుఫానులో ఓడలాగా కొట్టుకుని అటూ ఇటూ పొర్లసాగింది. వెలుతురుండగానే విమానం దిగిపోతుందన్న ఆశ అడుగంటింది. పెట్రోలు అయిపోయి విమానం దిగవలిసిందే. బహుశా విమానం వెయ్యి మైళ్ళ

“జ్యోతి”లో పాఠశాలలో ప్రార్థన



కన్న పోలేదనీ, అందులో చాలాభాగం ఈవరకే దాటి వుండాలనీ ప్రయాణీకులు అంచనావేశారు.

"ఇవి నేననుకున్నట్టు కారకోరం పర్వతాలయితే టిబెట్టులో మన ప్రయాణం ముగుస్తుంది. ఈ కారకోరం పర్వతాలలోనే ప్రపంచంలోకల్లా ఎత్తయిన రెండో శిఖరం వుంది. ఎవరెస్టు ఎక్కటంకన్నా అది ఎక్కటం అసాధ్యమని చెబుతారు," అన్నాడు విక్రం.

"మనం ఇక్కడి కెందుకొచ్చినట్టు?" అన్నాడు అభయంకర్.

"నువ్వన్నట్టు మన పైలట్ పిచ్చివాడే అనుకున్నా. మనం ఏంచేయగలం?" అన్నాడు షేక్‌సాయిబు.

"నా అనుమానంకూడా మన పైలట్‌కు పాపం, మతి సరిగాలేదనే. ఎట్లాచూసినా వాడుచేస్తున్న ఈపనికి అర్థం లేదు. ఇది నా మొదటి విమానప్రయాణం తెలుసా?" అన్నది శోభారాణి. "నేనెరిగిన పెద్దమనిషి ఒకాయన యుద్ధకాలంలో టిబెట్టుకు వెళ్ళివచ్చాడు. టిబెట్టువాళ్ళు చాలా వింతమనుషులని ఆయన చెప్పాడు. మనం కోతులనుంచి పుట్టామని వాళ్ళు నమ్ముతారుట."

ఒక ఆధునిక స్త్రీ ఆధునిక శాస్త్ర సమ్మతమైన విశ్వాసం ఉన్నందుకు అనాధునికులను వింతమనుషులనటం విక్రంకు వింతగా తోచింది. అతను క్రమంగా నిద్రకు ఉపక్రమించాడు. మిగిలినవారూ అదే పద్ధతి అవలంబించారు. చలి చాలా తీవ్రంగా ఉంది. కాని వారికి తానివ్వగల వెచ్చని దుస్తులేమీ లేవు. విక్రం నిద్రపోయాడు.

అకస్మాత్తుగా ఒక పెద్ద కుదుపుకు విక్రం తల విమానానికి కొట్టుకుని ప్రాణం దిమ్మరపోయింది. రెండో కుదుపుకు అతను సీటులోనుంచి దూరంగా పడ్డాడు. మిగిలినవారికీ అదే అనుభవం కలిగివుండాలి. అందరూ లేచి ఉన్నారు. ప్రయాణం అయిపోయింది.

[ఇంకావుంది]

జంబు ప్రొడక్షన్స్‌వారు తమిళం, హిందీ భాషలలో తయారుచేస్తున్న "మనైవియిన్ మగన్"లో హేమమాలిని నృత్యం

